## క్లుప్తంగా

### రంగనాథుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న రంగనాథుడు

మద్దికెర: మండలంలోని పెరవలి గ్రామంలోని శ్రీ రంగనాథస్వామి దేవాయలంలో స్వామి, అమ్మవార్లకు శనివారం పల్లకీసేవ నిర్వహించారు. ఉదయం బిందెసేవ, అష్టోత్తర నామార్చన తదితర పూజలు జరిపించారు. అనంతరం విశేషాలంకృతులైన ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ఆవరణలో ప్రదక్షణిలు చేయించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈఓ వీరయ్య, అర్చకులు రంగస్వామి, పారా రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### ప్రశాంత జీవనంతో ఆరోగ్యం



చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న దివ్యజ్ఞానానంద గిరి స్వామి

మద్దికెర : ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రశాంత జీవనంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని తొగటవీర క్షత్రియ కుల గురువు, పుష్పాండ మహర్షి ఆశ్రమం పీఠాధిపతి దివ్యజ్ఞానానంద గిరి స్వామి అన్నారు. శనివారం స్థానిక చౌడేశ్వరి దేవాలయంలో ఆలయ ధర్మకర్త పెద్ద కోట్ల రమేష్ స్వామిని ఆహ్వానించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వార్థంతో కాకుండా దయాగుణం కలిగి ఉండాలన్నారు. రమేష్, పూజారి ఆంజనేయులు, కమిటీ సభ్యులు వెంకటప్ప, కుండా సూరి, బాణా ఎర్రిస్వామి, పల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

### విద్యార్థినికి సన్మానం



హుసేనమ్మ, గోవింద్‌ను సన్మానించిన దృశ్యం

హాలహర్వి: మండల స్థాయిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన డి.హుసేనమ్మ, తండ్రి గోవింద్‌ను శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ చదువులో రాణించే వారిని తన వంతుగా ప్రోత్సహిస్తానని చెప్పారు. స్థానికులు వెంటకేశ్వరరెడ్డి, నరసప్ప,కిష్టప్ప, రంగముని, శ్రీధర్, గాదిలింగ ఉన్నారు.

### ప్రశాంతంగా వేలం పాటలు



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

హాలహర్వి: స్థానిక శ్రీరామ ఆలయ ఆవరణలో సర్పంచ్ మల్లికార్జున, గ్రామపెద్దల ఆధ్వర్యంలో శనివారం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన 24 ఎకరాల భూమికి, దుకాణాలకు వేలం నిర్వహించారు. సర్పంచ్ మల్లికార్జున, గ్రామ పెద్దలు నరసప్ప, వెంకటేశ్వరరెడ్డి, కిష్టప్ప, గోపాల్, ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేలాల్లో నరసప్ప మాట్లాడుతూ రాఘవేంద్ర స్వామి మఠానికి చెందిన 24 ఎకరాల భూమిని రూ.2.60 లక్షలకు కిశోర్ దక్కించుకున్నారని, ఆలయం పక్కనున్న దుకాణాలను రూ.3.60 లక్షలకు శ్రీధర్ దక్కించుకున్నట్లు చెప్పారు.

### బన్ని ఉత్సవంలో రింగు కర్రలు వాడొద్దు



సుళువాయిలో గ్రామస్తులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ బాలనరసింహులు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాలను సంప్రదాయంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, రింగు కర్రలు వినియోగించరాదని ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు. శనివారం రాత్రి సుళువాయి గ్రామంలో దేవరగట్టు ఉత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ బన్ని ఉత్సవాల్లో భక్తులు రింగు కర్రలు తీసుకెళ్లడం, మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనడం సంప్రదాయ కాదన్నారు. విగ్రహాల ఊరేగింపులో నిప్పు కాగడాలను భక్తులపై విసరడం, అల్లర్లకు దిగడం లాంటి పనులు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై గట్టి నిఘా ఉంటుందని చెప్పారు.

# యోగాలో రాణించి.. పతకాలు సాధించి

- చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్న కస్తూర్బా బాలికలు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వారంతా పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులు. చదువుకోవాలనే పట్టుదల.. క్రీడల్లో రాణించాలనే తపన.. వారిని విజయతీరాలకు చేర్చుతోంది. తల్లిదండ్రులను కోల్పోయిన, ఆర్థిక స్తోమత లేక అర్ధాంతరంగా చదువు ఆపేసిన బాలికలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో కస్తూర్బా గాంధీ విద్యాలయాలు అండగా నిలుస్తున్నాయి. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు కృష్ణగిరి కస్తూర్బా బాలికలు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జిల్లా క్రీడా అధికారులు(ఫైల్)

కృష్ణగిరి: స్థానిక కస్తూర్బా విద్యాయలం ఏటా పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. అలాగే చదువుతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థినులు రాణిస్తున్నారు. ఇక యోగాలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. విద్యాలయంలో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. ఇక్కడ చదువుతోపాటు రోజూ ఉదయం, సాయంత్రం యోగాలో పీఈటీ సుప్రియ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కఠినమైన ఆసనాలను సైతం అవలీలగా వేస్తుండటం విశేషం. జాతీయ స్థాయికి ఎంపిక కావడమే లక్ష్యంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు.

**కుమారి గెలుపు మంత్రం..**



కృష్ణగిరి మండలం బి.ఎర్రబాడు గ్రామానికి చెందిన మద్దయ్య, సుజాత దంపతుల కుమార్తె సి. కుమారి తొమ్మిదో తరగతి చదువుతోంది. యోగాపై ఆసక్తితో ప్రత్యేక శిక్షణ తీసుకుటోంది. పలు ఆసనాలు అవలీలగా వేస్తూ ఆకట్టుకుంటోంది. రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నానని, ఈ పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి తీసుకొస్తానని చెబుతోంది.

**గీతా.. యోగాలో మోత**

గుండ్లమల్లాపురం గ్రామానికి చెందిన రాముడు, ఈశ్వరమ్మ దంపతులు కుమార్తె సి.గీత తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆరవ తరగతి నుంచే యోగా ఆసనాలపై శిక్షణ పొందుతుంది. పోటీలు ఎక్కడ జరిగినా రాణిస్తూ అందరి మన్ననలు పొందుతుంది.



**పట్టువదలని రేవతి..**



ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన రేవతి ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతోంది. తండ్రి చనిపోగా తల్లి లక్ష్మి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. రేవతి చదువులో రాణిస్తూ పట్టుదలతో యోగాలో శిక్షణ పొందుతుంది. ఇదీ వరకే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. యోగాలో అంతర్జాతస్థాయికి ఎంపికై సత్తా చాటుతానని, భవిష్యత్తులో పీఈటీ ఉద్యోగం సాధించి నాలాంటి పేద బాలికలకు సహాయం చేస్తానంటోంది.

**'దివ్య'ంగా రాణిస్తోంది..**



మండలంలోని చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన చిరంజీవి, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె దివ్యకుమారి తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి ఆటో డ్రైవర్‌గా, తల్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన దివ్యకుమారి చదువుతోపాటు యోగాలో రాణిస్తుంది. గత నెలలో జిల్లా కేంద్రంలో జరిగిన యోగా పోటీల్లో అవలీలగా యోగాసనాలు చేసి ఔరా అనిపించుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పోటీల్లో రాణించి తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకొస్తానని గర్వంగా చెబుతోంది.

ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికై తర్ఫీదు పొందుతుంది. ఈ పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక అవుతానని చెబుతోంది.

**క్రీడలపై ఆసక్తితో..**

మండల కేంద్రం కృష్ణగిరికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ, జైతూన్‌బీ దంపతుల కుమార్తె అయిషా ఆరవ తరగతి చదువుతోంది. పాఠశాలలో చేరిన నాలుగు నెలల్లోనే యోగాలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడల్లో రాణించాలనే పట్టుదలతో సాధన చేసి సత్తా చాటింది. తండ్రి డ్రైవర్‌గా, తల్లి టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. జాతీయస్థాయికి ఎంపిక కావడమే లక్ష్యమంటోంది.



**బాలికలకు ఉజ్వల భవిష్యతఖ**



కస్తూర్బా పాఠశాలలో చదివే బాలికలకు విద్యతోపాటు వారి భవిష్యత్తు తీర్చిదిద్దుకునేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. వాటితో పాటు జీవనోపాధికి అవసరమైన వృత్తి విద్య కోర్సులు నిర్వహిస్తున్నాం. బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు యోగా, క్రీడల్లోనూ శిక్షణ ఇస్తున్నాం. మా విద్యార్థినులు చదువుతో పాటు యోగా పోటీల్లో మంచి ప్రతిభ చూపుతున్నారు.

– చైతన్య స్రవంతి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, కృష్ణగిరి

### రాయితీ శనగ మంజూరు

దేవనకొండ: మండలానికి 520 క్వింటాళ్ల సబ్సిడీ పప్పు శనగ విత్తనాలు మంజూరయ్యాయని ఏఓ సురేష్‌బాబు తెలిపారు. శనివారం నుంచి రైతులకు పంపిణీ చేస్తున్నామని, క్వింటా పూర్తి ధర రూ.9,400 ఉండగా, రాయితీ 25 శాతం రూ.2350 పోగా రైతు వాటా రూ.7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

### మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు: ఈనెల 3వ తేదీ నుంచి మద్యం షాపుల ఏర్పాటుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆలూరు ప్రొహిబిషన్,అండ్ ఎక్సైజ్ సీఐ లలితదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 9 మద్యం దుకాణాలను నోటిఫై చేశామన్నారు. స్థానిక కార్యాలయంలో 9వ తేదీలోపు మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇక్కడే కాకుండా జిల్లాలోని 7 కేంద్రాల్లో మద్యం షాపుల దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులు వెసులుబాటు కల్పించారని పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ నవీన్, సచివాలయ సిబ్బందిని దరఖాస్తుల స్వీకరణ కోసం నియమించామని వెల్లడించారు.

### అర్హులైన రైతులందరికీ శనగ విత్తనాలు

హాలహర్వి: అర్హత ఉన్న రైతులందరికీ పప్పుశనగ విత్తనాలు అందించేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సబ్సిడీ పప్పు శనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఎంపీడీఓ వరలక్ష్మి, తహసీల్దార్ నజ్మాబాను, ఏఓ శివశంకర, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, సర్పంచ్ మల్లికార్జున పాల్గొన్నారు.

# వైభవం..అమ్మవారి దివ్య అలంకారం



పత్తికొండలో గాయత్రీ దేవిగా కన్యకాపరమేశ్వరి



తుగ్గలిలో అన్నపూర్ణాదేవిగా దుర్గామాత



ఆస్పరి: అన్నపూర్ణాదేవిగా గాయత్రీ మాత



ఆస్పరి: గాయత్రీ దేవిగా వాసవీ మాత



పెరవలిలో అన్నపూర్ణగా రాజరాజేశ్వరి దేవి



మద్దికెర: గాయత్రీ దేవి అలంకరణలో దేవమ్మ



ఆస్పరి: గాయత్రీ మాతను దర్శించుకుంటున్న భక్తులు



అన్నపూర్ణాదేవిగా సుంకుల పరమేశ్వరి



వెల్దుర్తి: గాయత్రీ దేవిగా కన్యకాపరమేశ్వరి



ఆలూరు: మంగళగౌరిగా వాసవీ మాత



కటారుకొండలో అన్నపూర్ణదేవిగా దుర్గా మాత



వెల్దుర్తిలో అన్నపూర్ణదేవిగా భువన గాయత్రీ

పత్తికొండ/తుగ్గలి : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం పత్తికొండ శ్రీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూలు, ఆభరణాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఉపవాస దీక్షతో ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే..తుగ్గలిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఆస్పరి: శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా శనివారం రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే మండల కేంద్రంలో కన్యకాపరమేశ్వరి, మారెమ్మవ్వ, రామతీర్థంలోని పార్వతీదేవి గాయత్రీ మాత అలంకారంలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో పూజారులు అమ్మవార్లకు గంగ,ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు. గాయత్రీమాత ఆలయ ఆవరణలో కళాకారులు భక్తి పాటలతో చెక్క భజన చేశారు.

ఆలూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారం శనివారం మంగళగౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి గంగపూజ పుష్ప,ఫల, పంచామృతాభిషకం, మహామంగళ హారతి తదితర పూజలను నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నియోజకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు జనార్ధన్‌శెట్టి, గూడూరు వేణుగోపాల్ శెట్టి, నాయకులు భాస్కర్, నాగేంద్రయ్య,రంగయ్య శెట్టి, రవి, సుబ్రహ్మణ్యం, శ్రీనాథ్ పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని మొలగవెల్లి, హత్తిబెళగళ్ , పెద్దహోతూరు గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

మద్దికెర : పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో శనివారం రాజరాజేశ్వరిదేవి అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మండల కేంద్రంలోని చౌడేశ్వరీ దేవాలయం, ఎస్సీ కాలనీలోని దేవమ్మ ఆలయంలో అమ్మవార్లు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు.

కృష్ణగిరి: వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో దేవి శవన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామంలో శనివారం దుర్గాదేవి అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. అలాగే వెల్దుర్తి అమ్మవారిశాలలో గాయత్రీ దేవిగా కన్యకాపరమేశ్వరి, భువన గాయత్రీ అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

**అన్నపూర్ణాదేవి అలంకరణలో..**

దేవనకొండ: శరన్నవ నవరాత్రోత్సల్లో భాగంగా మండల కేంద్రంలోని శనివారం సుంకుల పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆంజనేయులు

ఆలూరు: పొదుపు మహిళలు పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వెలుగు ఏపీఎం ఆంజనేయులు అన్నారు. స్థానిక ఏసీ కార్యాలయంలో సీసీ నాగవేణి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పొదుపు గ్రూపుల సభ్యులు, సంఘం లీడర్లు, ఎంబీకేలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పొదుపు గ్రూపు సభ్యులుగా చేరిన వారికి పొదుపుతో పాటు బ్యాంకు లింకేజీ ద్వారా వారి చేతివృత్తుల ఆధారంగా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. మండలంలో 16 జీపీలలో 1,060 సంఘాలు ఉన్నాయన్నారు. గతంలో పొందిన రుణాలను పూర్తిస్థాయిలో రికవరీ చేసిన గ్రూపులకు బ్యాంకు అధికారులతో చర్చించి ముద్ర రుణాలను మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీసీలు మల్లికార్జున, ఉమాపతి ఉన్నారు.

## రామళ్లకోటలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని రామళ్లకోట గ్రామంలో శనివారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నిర్మల సహకారంతో హెచ్ఐవీ, సుఖవ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 104 వైద్య అధికారిణి ఎంవీ భుజన తేజ మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధి పట్ల వలస కూలీలు, హమాలీ వర్కర్స్, యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. జోనల్ సూపర్‌వైజర్ రామాంజనేయులు మాట్లాడుతూ ఈ వ్యాధి కేవలం కలుషితమైన సూదుల సిరంజీలు, పరీక్షింపబడని రక్తం ద్వారా, అసురక్షిత లైంగిక సంబంధాల వల్ల సంక్రమిస్తుందని చెప్పారు. సీహెచ్ఓ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లోని పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు శనివారం బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దార్లు చంద్రశేఖర్, చంద్రశేఖర్‌వర్మ తెలిపారు. వెల్దుర్తి మండలం బుక్కాపురం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఎల్లకృష్ణ పుల్లగుమ్మి గ్రామానికి, రామళ్లకోట వీఆర్వోగా ఉన్న బీవీ రమణారెడ్డి చెరుకులపాడు గ్రామానికి, ఎస్.పేరేముల గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న మౌలాలి కలుగొట్ల గ్రామానికి బదిలీ చేశారు. అలాగే కృష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామ వీఆర్వోగా ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి రాజశేఖర్‌రెడ్డి, కంబాలపాడు వీఆర్వోగా హుసేనాపురం-2లో పనిచేస్తున్న ప్రహ్లాద శనివారం బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.



రామళ్లకోట తేరు బజార్‌లో ఇళ్ల మధ్య వర్షపు నీటి ప్రవాహం



ఎస్‌హెచ్ బోయినపల్లి వద్ద బొప్పాయి తోటలో నిలిచిన వర్షపు నీరు

## వెల్దుర్తిలో భారీ వర్షం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పంట పొలాల్లో భారీగా నీరు నిలవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వెల్దుర్తి సమీపంలోని వంకతోపాటు చెరుకులపాడు గ్రామ సమీపంలోని హంద్రీలో కూడా వర్షపునీరు భారీగా ప్రవహించింది. రామళ్లకోట గ్రామంలోని తేరు బజార్‌లోని కాలనీలో వర్షపునీరు ఉధృతంగా ప్రవహించింది. ఎస్‌హెచ్ బోయినపల్లి, తదితర గ్రామాల్లో వర్షానికి బొప్పాయి, పసుపు తదితర పంటల్లో నీరు నిలిచిపోయింది.

## ఆర్డీఓ రామలక్ష్మికి సన్మానం



ఆర్డీఓ రామలక్ష్మికి వీడ్కోలు పలుకుతున్న అధికారులు

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ ఆర్డీఓ ఎన్. రామలక్ష్మి గుంటూరు జిల్లా రేపల్లెకు బదిలీ అయ్యారు. దీంతో శనివారం రాత్రి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆమెకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఆమెను పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికి సేవలను కొనియాడారు.

## లారీ ఢీ.. బాలుడికి తీవ్ర గాయాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఆస్పరి రోడ్డులో ఉన్న బైపాస్ వద్ద బైక్‌ను లారీ ఢీకొనడంతో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బి.ఎం.సూగూరు గ్రామానికి చెందిన బసవరాజు, జయదీప్(6) శనివారం ఆస్పరి మండలం హలిగేర గ్రామానికి వెళ్తున్నారు. పెట్రోల్ బంకు వద్ద లారీ బైకును ఢీకొనడంతో బాలుడు జయదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

## పారిశుద్ధ్యం.. అధ్వానం!

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో పారిశుద్ధ్యం దైవాదీనంగా మారింది. చినుకు పడితే వీధులు చిత్తడిగా మారుతాయి. మండలంలో పెద్ద గ్రామైమన గూళ్యంలో పారిశుద్ధ్యం లోపించింది. దోమల బెడద తీవ్రంగా ఉందని, దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలోని హైస్కూల్ ప్రాంతం, సులువాయి రోడ్డులో చెత్త ఎక్కువగా పేరుకుపోయిందని, వాటిని తొలగించే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మురుగు కాల్వలు పూడిపోయి వర్షం వస్తే పొంగిపొర్లుతున్నాయని దీంతో వీధులు దుర్గంధం వెదజల్లుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





గూళ్యం గ్రామంలో ఇళ్ల మధ్య మురుగు నీటి కుంటలు

## 8న ఆలూరులో జాబ్‌మేళా

ఆలూరు: రాష్ట్ర వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్.ఆనందరాజ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ,డిగ్రీ, పాలిటెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన, లేదా ఫెయిల్ అయిన 19 – 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌లతో పాటు రెండు పాస్ పొటోలతో రావాలన్నారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్, సన్ కిసాన్ అగ్రి అండ్‌కో, నవభారత్ ఫర్టిలైజర్స్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

## 9న చేపల పెంపకానికి వేలం

కృష్ణగిరి: మండల కేంద్రం సమీపంలోని హంద్రీనీవా రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి సంబంధించి ఈ నెల 9వ తేదీన స్థానిక గ్రామ సచివాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు గాజులదిన్నె ప్రాజెక్టు అధికారి చంద్రయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి నుంచి 2025 జూన్ 30 వరకు జిల్లా కలెక్టర్ నిర్ణయించిన గుత్త మొత్తం రూ.66,131గా ఉందన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్‌కార్డుతో పాటు రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పైగా, పాటలో అధికంగా పాడిన వారికి హక్కు లభిస్తుందని పేర్కొన్నారు.